క్లుప్తంగా

నేడు పాలూరులో ఆరోగ్య సురక్ష

చిత్తూరు రూరల్: మండలంలోని పాలూరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరంతరం ఓటర్ల నమోదు

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంల యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రొసీజర్ (ఏటీపీ) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి త్వరలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్‌డీవో రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



మృతుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న నాయకులు

ఐరాల: మండలంలోని ఎం.పైపల్లె పంచాయతీ జంగాలపల్లెకు చెందిన గోపి మంగళవారం మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి బుధవారం అందించారు. నిరుపేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్‌రెడ్డి, రత్నంరెడ్డి, బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

రేపు అండర్-17 స్కూల్ గేమ్స్ కబడ్డీ జట్ల ఎంపిక

చౌడేపల్లె: ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 స్కూల్ గేమ్స్ బాల బాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈనెల 13న శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం నాగరాజారెడ్డి , ఆర్గనైజింగ్ కార్యదర్శి రామచంద్ర బుధవారం తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, హైస్కూల్ లేదా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ ఉండాలన్నారు. బాలబాలికలు 55 కేజీలలోపు బరువు ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు నవంబర్‌లో చౌడేపల్లెలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 9440934507, 9652935524 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పవిత్రాల ఊరేగింపు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీస్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవార్లకు, జయ విజయులకు, గరుడాళ్వార్‌కు, ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ గావించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

మూడవ రోజు ఉదయం 9–30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 11–30 నుంచి 12–30 గంటల మధ్య మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నట్లు ఏఈఓ రమేష్ తెలిపారు.

జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

- సామాన్యులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం



పూతలపట్టు: హెల్త్ కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ గౌరి



గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

బంగారుపాళెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్యసురక్ష' కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తోందని.. సామాన్యులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. బంగారుపాళెం మండలం టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రామ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 450 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజా ప్రతినిధులు సందర్శించారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్, సర్పంచ్ రత్తయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మానస, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ అన్నారు. మండలంలోని వరదరాజులపల్లె సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పేదలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

పేదలకు వరం

పూతలపట్టు: ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సురక్ష క్యాంపు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని 375 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. అలాగే ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

పైసా ఖర్చులేకుండా మెరుగైన వైద్యం

గుడిపాల: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సురక్ష వైద్య శిబిరాల ద్వారా పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మరకాలకుప్పం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 259 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు రష్మిత, హరి, శివకుమార్, ప్రియాంక, సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి పెద్దపీట వేసి ఎన్నో రకాల వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నారని ముదిగోళం సర్పంచ్ భారతి అన్నారు. మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని ముదిగోళం సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 323 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చందన, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రరెడ్డి, ఎంపీహెచ్ఈఓ శంకరయ్య పాల్గొన్నారు.



ఐరాల: వృద్ధులకు కళ్ల జోడు అందిస్తున్న సర్పంచ్ భారతి



యాదమరిలో..



తవణంపల్లె: తొడతరలో వైద్య పరీక్షలు

రేపు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవానికి శుక్రవారం ముహూర్తం ఖరారైంది. నగరంలోని పాత కలెక్టరేట్‌లో ఉన్న మైనింగ్ శాఖ కార్యాలయాన్ని రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించారు. అధికారుల ఆమోద ప్రక్రియ కూడా పూర్తయింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ మురళి మోహన్ తెలిపారు.

ఇంటింటా సాయి భజన

చిత్తూరు రూరల్: సత్యసాయి జయంతిని పురస్కరించుకుని నగరంలో బుధవారం ఇంటింటా భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరింపేటలోని శ్రీసత్యసేవా సమితి మందిరంలో సహస్రనామార్చన, పుష్పయాగం చేశారు. తదనంతరం భజనలు చేశారు. నిర్వాహకులు మధుసూదనం, శేష నారాయణ పాల్గొన్నారు.

నెమలిని మింగిన కొండచిలువ



రామభద్రాపురం గ్రామ ఆవరణలో కొండచిలువ

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో కొండచిలువ నెమలిని మింగేసింది. జయరాంనాయుడు పొలాల వద్ద బుధవారం సాయంత్రం మేతకోసం నెమళ్లు వచ్చాయి. అక్కడే ఉన్న కొండచిలువ నెమలిని మింగడంతో ఎటూ కదలలేక అక్కడే ఉండిపోయింది. గమనించిన గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకుమారికి సమాచారం అందించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు త్వరలో గిఫ్ట్ స్కీంలు

- చిత్తూరు 2 డిపో మేనేజర్ రూపశ్రీ



కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశును సత్కరిస్తున్న డిపో మేనేజర్ రూపశ్రీ

కాణిపాకం(యాదమరి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి గిఫ్ట్ స్కీంలు ప్రవేశపెడుతున్నట్లు ఆర్టీసీ టూ డిపో మేనేజర్ రూపశ్రీ తెలిపారు. బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈఓ వెంకటేశును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువ కప్పి సన్మానించారు. అనంతరం రూపశ్రీ మాట్లాడుతూ.. ఆర్టీసీలో ప్రయాణించడానికి మరిన్ని పథకాలు తీసుకొస్తున్నట్లు వివరించారు. కాణిపాకం– చిత్తూరు మధ్య ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి ప్రతి నెలా గిఫ్ట్ స్కీంలు ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. ఈ స్కీంను కాణిపాకంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆలయం తరపున భక్తులకు ప్రచారం కల్పించాలని సూచించారు. పౌర్ణమి రోజున తిరువణ్ణామలైకు, పండుగ వేళల్లో తిరుత్తణి, అలాగే తక్కువ ధరతో అయ్యప్ప భక్తులకు బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆలయ ఈఓ వెంకటేశు మాట్లాడుతూ.. స్వామివారి బ్రహ్మోత్సవాల రోజుల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ తగినన్ని సర్వీసులు నడిపాయని కొనియాడారు. కాణిపాకం వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించే విధంగా సహకారం అందిస్తామన్నారు. చిత్తూరు 2 డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

గుడిపాల: మహిళా సంఘాలకు మండల సమాఖ్య ద్వారా విరివిగా రుణాలను అందజేయనున్నట్లు ఏపీఎం సుధారాణి అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల సమాఖ్య నిధి నుంచి బయోమెట్రిక్ ద్వారా ప్రతి మహిళా సభ్యురాలికి రుణం ఇస్తామన్నారు. బ్యాంకుతో పాటు స్త్రీనిధి, మండల సమాఖ్య ద్వారా విరివిగా రుణాలను అందించాలని సంఘమిత్రలను ఆదేశించారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

15 నుంచి వేపంజేరి బ్రహ్మోత్సవాలు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరిలోని ప్రముఖ శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, ఫౌండర్ కేఎస్.శ్రీధర్, న్యాయవాది వాసు, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులు రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ అంకురార్పణ, 16న తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం ,శేష వాహనం, 17న హంస వాహనం, 18న సింహ వాహనం, 19న సూర్య, చంద్రప్రభ వాహన సేవలు, 20న గజ వాహనం, 21న మోహినీ అవతారం, గరుడ సేవ, 22న హనుమంత వాహనం, 23న రథోత్సవం, అశ్వ వాహన సేవలు జరుగుతాయని వివరించారు. 24న చక్రస్నానం ద్వాదశారాధనం, ధ్వజావ రోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో భవనాలకు నిధుల మంజూరు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో జిల్లా స్టోర్ నూతన భవన నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మొత్తంతో డీఈ, రెండు ఏఈ కార్యాలయాల భవనాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పనులకు సంబంధించి టెండర్లు పిలిచామని వివరించారు.

మొగిలి ఘాట్‌లో చిరుత సంచారం!



మొగిలి ఘాట్‌లోని కౌండిన్య అడవిలో సంచరిస్తున్న చిరుత

పలమనేరు: కౌండిన్య అడవిలో గత కొన్నాళ్ల నుంచి మేకలు, లేగదూడలు మృత్యువాతపడుతున్నాయి. దీంతో అడవిలోకి పశువులు, మేకలను మేతకు తీసుకెళ్లడానికి పశుకాపరులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల క్రితం బైరెడ్డిపల్లె మండలంలోని గౌనితిమ్మేపల్లె అటవీ సమీప పొలాల వద్ద ఓ లేగదూడ మృతిచెందగా, మరో దూడ గాయపడింది. ఇవి పులిలాంటి చారలు కలిగిన హైనా అనే జంతువని అటవీశాఖ అధికారులు కొట్టి పడేశారు. తాజాగా మంగళవారం సాయంత్రం మొగిలిఘాట్‌లో చిరుత కనిపించడంతో దాన్ని ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో బంధించాడు. దీంతో అటవీశాఖ అధికారులు సైతం ఆందోళనలో పడ్డారు. ఏదేమైనా ఇప్పుడు చిరుత సంచరించిన ప్రాంతానికి సమీపంలోని జగమర్ల, గాంధీనగర్, మొగిలి తదితర అడవీ శివారు పల్లెల వాసులకు చిరుత భయం తప్పడం లేదు.

కౌండిన్యలో హైనాలతోపాటు చిరుత

కౌండిన్య అభయారణ్యంలో ఇప్పటివరకు మృతి చెందిన మేకలు, దూడల మృతదేహాలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు ఇది హైనాల పనేనని తేల్చారు. ఎందుకంటే చిరుత పులి అయితే జంతువు మాంసం కూడా తినేస్తుందని హైనాలు గొంతును కొరికి కేవలం రక్తం మాత్రమే తాగుతాయని చెబుతున్నారు. ఇటీవల అడవి జంతువుల గణన చేసినప్పుడు కూడా చిరుత పులుల పాదముద్రలు కనిపించలేదని వారు చెబుతున్నారు. అయితే ఈ అడవిలో గుంత నక్కలు, తోడేళ్లు, అడవి కుక్కలు, అడవి పందులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గతేడాది తమిళనాడులోని కౌండిన్య సమీప గ్రామంలోకి చిరుత వెళ్లి ఓ కుటుంబసభ్యులను గాయపరిచిన విషయం తెలిసిందే. తాజాగా చిరుతను ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో వీడియో తీయడంతో అధికారులు సైతం చీతా విషయమై గాలించాల్సిన అవసరం వచ్చింది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



వేదవతి మృతదేహం

పూతలపట్టు: మండలంలోని పేటాగ్రహారంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు ఐరాల మండలం పుత్తరమద్ది గ్రామానికి చెందిన దొరస్వామిశెట్టి భార్య వేదవతి (31) కుటుంబ కలహాలతో భర్తతో గొడవపడి పూతలపట్టు మండలం పేటాగ్రహారంలోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం 3 సమయంలో మనస్తాపంతో విద్యుత్‌తీగతో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈమెకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాడవాడలా మంత్రి జన్మదిన వేడుకలు



సంతపేటలో భూపేష్ ఆధ్వర్యంలో అన్నదానం



గాంధీవిగ్రహం వద్ద రాహుల్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, చంద్రశేఖర్, మేయర్



పాతకోర్టు వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కేక్ తినిపిస్తున్న జ్ఞానజగదీష్



ఆస్పత్రిలో పిల్లలకు కిట్ల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను చిత్తూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద కేక్ కట్ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో 30 మంది బాలింతలకు పిల్లల కిట్స్ అందజేశారు. గిరింపేటలో వినాయక బాలాజీ ఆధ్వర్యంలో, గాంధీకూడలి వద్ద డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్ నాయకత్వంలో, పాతకోర్టు వద్ద జ్ఞానజగదీష్, సంతపేట కూడలిలో భూపేష్ ఆధ్వర్యంలో కేకులు కట్ చేసి అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, కార్పొరేటర్లు, నాయకులు టిమ్ము, జనార్ధన్, త్యాగ, మురళీ, నవీన్, ఆలీ, కుట్టిరాయల్, నారాయణ, అల్తాఫ్, కిరణ్, కిషోర్, రామ్మూర్తి, వెంకటేష్, మనోజ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు. పూతలపట్టులోని పార్టీ కార్యాలయం వద్ద భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ ఐరాల మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు గాంధీబాబు, కరీం, పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్, రవి రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, తేజరెడ్డి, స్వరూప్‌రెడ్డి, జగ్ననాథరెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

గుడిపాల: ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడిపాలలో కేక్ కట్ చేశారు. జడ్పీ వైస్ చైర్మన్ రమ్య, పార్టీ నాయకులు రవీంద్రారెడ్డి, రజనీకాంత్, కారి మేఘన్, డానియల్, శేఖర్, వెంకటేశులు, చిట్టిబాబు పాల్గొన్నారు.

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయ రెడ్డి పాల్గొన్నారు.



తవణంపల్లెలో..



కాణిపాకంలో..



గుడిపాలలో..



పూతలపట్టులో..



బంగారుపాళెంలో..